# సంపాదకీయము

మళ్ళీ పార్థివ నామ సంవత్సరము వచ్చింది. 60 ఏళ్ళు గడచిందంటే మానవులం మనము ఆత్మావలోకనం చేసుకొంటాము. మనం సాధించిన విజయాలను నెమరువేసు కొంటాము. తరువాతి తరానికి కావలసిన సూచనలు, సలహాలు అవసరమయినపుడు అందచేస్తుంటాము. కాని యిది విశిష్ఠమూర్తి మత్వమునకు కూడా వర్తిస్తుందాయని ప్రశ్నించుకొన్న ప్పుడు యిదమిత్థంగా ఏమీచెప్పలేని అజ్ఞానం ఆవరిస్తుంది. కాని మన పూజ్య గురుదేవులు శ్రీ రామచంద్రజీ గారు, తన ఆత్మకథలో తన గొప్పతనము, మహాత్మ్యము తను భౌతికకాయము వీడిన తరువాతగాని ప్రపంచమునకు గ్రాహ్యము కాదని పలుమార్లు నుడివియున్నారు. విశిష్ఠ మూర్తిమత్వము ఆవిర్భవించాక 40 సంవత్సరములకు ఆయన తన భౌతికకాయన్ని వీడారు. ఇప్పుడు మనము అనునిత్యము అనుభవించే ప్రాణాహుతిద్వారా మనమాయనకు ఎంత చేరువో తెలుసుకోగలుగుతున్నాము. నిజజీవితంలో, అంటే మన భౌతిక కాయము ద్వారా, అ మహా మనీషిని ఎరుగక పోయినా మన ఆధ్యాత్మిక అనుభవము ద్వారా ఆ విశిష్ట మూర్తిమత్వపు గాఢ పరిష్వంగము అనునిత్యము కలిగే తనివితీరని అనుభవమని సాధకులు ఎరుగుదురు.

ధర్మగ్లాని కలిగినపుడల్లా భగవంతుడవతరించి ధర్మసంస్థాపన గావించుతాడని భగవంతుడే స్వయంగా పలికినాడని ఆర్ష నమ్మకము. శ్రీ రాముడవతరించి, దుష్ట శిక్షణ గావించారు. శ్రీ కృష్ణుడవతరించి అదే కార్యము మళ్ళీ చేసాడు. అంతటితోయాగక సర్వకాలమునకూ వర్తించే గీతనుపదేశించి కర్తవ్య పాలనెట్లుండవలెనో బోధించాడు. సర్వులకు సమ్మతమయిన సంయమన మార్గము పాటించుటెట్లో విశదముగ తెలియపరచాడు. నిష్కామకర్మ సిద్ధాంతము నావిష్కరించాడు. కాయిక, మానసిక, ఆధ్యాత్మిక రంగములలో సమతుల్యత రాజయోగముద్వారా ఎట్లు సాధించవచ్చో బోధపరచాడు. యోగమార్గంలో భక్తిని ప్రవేశపెట్టి ధర్మమంటే ఏమిటో విశదీకరించాడు.

అటువంటప్పుడు ఆ యుగపురుషుని కాలము ముగియకముందే మన గురుదేవులు 60 సంవత్సరములకు ముందవతరించి మనందరికి స్వయంగా తానే ఎరుక పరచుకొన్నాడు. ఇప్పుడు కలిగిన ధర్మగ్లాని ఏమిటి యని ప్రశ్నించుకొంటే ధర్మమంటే ఏమిటనే ప్రశ్న ఉదయిస్తుంది. ప్రతి తరమూ తామేదో ప్రబుద్ధులయినట్లూ, తరువాతి తరం వారిదంతా తప్పయినట్లు మాట్లాడడము తరతరాలుగా వస్తున్న ఆనవాయితి. అది అట్లుంచి ధర్మమంటే ఏమిటని తరచి చూస్తే పరోపకారము, పరహితము, స్వార్థరాహిత్యము, శాంతికామకత వంటి సద్గుణములు దృష్టికి వస్తాయి.

ముందెన్నడో జ్ఞానమంతా తనదేనని వేదాలను బ్రహ్మనుంచి కాజేసి సముద్రపు లోతులో కెళ్లితే, జ్ఞానమొకరిసొత్తుకాదని తెలియపరచి వినని మూర్ఖున్ని నిర్జించి ధర్మమును రక్షించాడు. ఇంకో ప్రబుద్ధుడు ఈ విశాల ప్రపంచమంతా నాదేనని దాన్ని చంకనెట్టుకొంటే అది భగవంతునిది అందుమూలంగా యందరిదీ యని స్వార్థానికి మరోమారు పాఠం చెప్పడం జరిగింది. మమకారంతో సోదరప్రేమయని తలంచి విశ్వమంతా తన చెప్పుచేతలలో యుండాలనహంకరించిన అసురాధమున్ని "తాడిని తన్నేవాడుంటే దాని తలతన్నేవాడుంటాడని" అతితెలివిని అతి తెలివిగా జయించి ప్రజ్ఞాపాటవాన్ని ప్రదర్శించి మరోమారు స్వార్థపరమయిన కుబుద్ధికి, ఈశ్వరతత్వము పాఠముచెప్పింది. కుబ్జరూపమును ధరించుటకు వెనుకంజక దురహంకార కుటిలాత్ముని మదమణగద్రొక్కినా తగుమాత్రపు గౌరవమూ ప్రసాదించి ధర్మమంటే అణగ ద్రొక్కడము మాత్రమేకాదు ఆదరించి అనుగ్రహించడము కూడాయని తెలిపాడు. క్షత్రియవీర్యం వెర్రితలలు వేస్తే తలలు తీయడానికి వెనుకంజవేయలేదు. ధర్మ సూక్ష్మ మటువంటిది. ఈశ్వర తత్వానికి దయాగుణమాపాదించింది మనమే. అది ఎల్లప్పుడూ నిష్పక్షపాతమే. స్వార్థము, అహంకారమూ హద్దులుమీరి ప్రవర్తించే సరళికి సౌమ్యంగా ఒక సారి పాఠముచెపితే, మరోమారు ఒళ్లు జాగ్రత్తయని శ్రీ చక్రాన్ని ప్రయోగించడాన్ని మనం తెలుసుకొన్నాము. ఇంత జరిగాక కూడా, కొందరు విశ్వమంతా తమదేయనే సామ్రాజ్యవాదాన్ని తెలివితో, శక్తితో, అణుశక్తితో ఇతరులపై రుద్ది, వారి కష్ఠములనెన్నక, వారి దరిద్రాన్నే తమ సంపదగా భావించే అసుర పోకడ గత 4 శతాబ్ధములుగా వికటాట్టహాసమే ఇప్పటి విశిష్ఠమూర్తిమత్వ మావిర్భవించడానికి ముఖ్యకారణంగా విజ్ఞులెరుగుదురు.

తనదైన శైలిలో పని ప్రారంభించి బృహత్ క్షాళణా కార్యక్రమమును కొనసాగిస్తున్న ఆ యుగపురుషునకు మనవంతు శ్రమనందించి మన జన్మలను సార్థకము చేసుకొంటున్నవారందరికీ వారి జన్మదిన సందర్భాన సత్యపథపు శుభాకాంక్షలు.

(బాబూజీ జన్మదిన సంచికః 2005 ః12-2)